ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చిస్తున్న తెలంగాణభవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్

ఢిల్లీలో నూతన తెలంగాణ భవన్

- తెలంగాణ రాష్ట్ర సంస్కృతి ప్రతిబింబించేలా భవన నిర్మాణం
- విభజన ఆస్తులపై ప్రత్యేక దృష్టి
- ఢిల్లీలో అధికారులతో సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- పరిచయం ఉన్న ఎంపీలకు విందు

హైదరాబాద్, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ): తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా ఢిల్లీలో నూతన తెలంగాణ భవన్ నిర్మిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. మంగళవారం న్యూఢిల్లీలోని తన నివాసంలో తెలంగాణభవన్, ఆంధ్రప్రదేశ్ భవన్‌తోపాటు రెండు రాష్ట్రాల ఉమ్మడి ఆస్తుల విభజనపై సమీక్షించారు. తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్, ఓఎస్డీ సంజయ్‌జాజుతో చర్చించారు. భవన్ మొత్తం విస్తీర్ణం ఎంత? అందులో ఉన్న భవనాలు ఎన్ని? వాటి స్థితి ఏమిటి? అందులో తెలంగాణ వాటా ఎంత? తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఉమ్మడిగా 19.781 ఎకరాల భూమి ఉందని, అందులో ఉమ్మడి భవన్ పరిధిలోని 8.781 ఎకరాల్లో శబరి బ్లాక్, అంతర్గత రోడ్లు, గోదావరి బ్లాక్, 3.359 ఎకరాల్లో ఓల్డ్ నర్సింగ్ హాస్టల్, 7.641 ఎకరాల్లో పటౌడి హౌస్ ఉన్నాయని అధికారులు తెలిపారు. తెలంగాణ వాటా కింద ఎంత భూమి వస్తుందని సీఎం ప్రశ్నించగా.. రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం 8.245 ఎకరాల భూమి వస్తుందని, ఏపీకి 11.536 ఎకరాలు (41.68:58.32 నిష్పత్తిలో) వెళ్తుందని అధికారులు తెలిపారు. మూడు, నాలుగు భవనాలు దశాబ్దాల క్రితం నిర్మించినవి కావడంతో చాలా వరకు శిథిలావస్థకు చేరాయని, మరమ్మతులు చేయిస్తున్నామని గౌరవ్ ఉప్పల్ తెలిపారు. రెండు రాష్ట్రాల మధ్య ఉన్న ఆస్తుల విభజనపై దృష్టి సారించాలని అధికారులను సీఎం ఆదేశించారు. అనంతరం తనకు పరిచయం ఉన్న ఎంపీలకు విందు ఇచ్చారు.

త్వరలో ఢిల్లీలోని అధికారిక భవనంలోకి సీఎం

రేవంత్‌రెడ్డి సీఎం ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత తొలిసారి ఢిల్లీ తుగ్లక్ రోడ్డులోని 23వ నంబర్ బంగ్లా (అధికారిక నివాసం)ను సందర్శించారు. ప్రస్తుతం ఆయన నివాసం ఉన్న యమున అపార్ట్‌మెంట్‌లోని 902 ఫ్లాట్‌ను త్వరలోనే ఖాళీ చేస్తారు. తుగ్లక్ రోడ్డులోని బంగ్లాలో మార్పుచేర్పులు చేసి పూజా కార్యక్రమాల తర్వాత అందులోకి వెళ్తారు. ఢిల్లీ అధికారిక భవనంలో కేసీఆర్ 20 ఏండ్లు నివాసం ఉన్నారు. 2004 నుంచి 2014 వరకు ఎంపీగా, మంత్రిగా తుగ్లక్ రోడ్డు నివాసం నుంచే కార్యకలాపాలు నిర్వహించారు. ఆ తర్వాత 2014 నుంచి 2023 డిసెంబర్ తొలివారం వరకు ముఖ్యమంత్రి హోదాలో కేసీఆర్‌కు అదే అధికారిక నివాసంగా అదే బంగ్లా. తెలంగాణలో ఎన్నికల ఫలితాల అనంతరం కేసీఆర్ సిబ్బంది ఆ బంగ్లాను ఖాళీ చేసి తెలంగాణ భవన్ అధికారులకు అప్పగించారు.

మరో 900 కోట్ల అప్పు చేసిన తెలంగాణ

హైదరాబాద్, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ): తెలంగాణ మరో రూ.900 కోట్లు అప్పు చేసింది. బాండ్ల విక్రయాల ద్వారా రాష్ట్రానికి రూ.900 కోట్లు కావాలని గత శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ఆర్బీఐని కోరగా, మంగళవారం మంజూరుకు అనుమతిచ్చింది. 18 ఏండ్ల కాల పరిమితితో ఆ రుణాన్ని పొందింది. దేశంలోని 13 రాష్ట్రాలకు మొత్తం రూ.19,592 కోట్ల రుణాలిస్తున్నట్టు ఆర్బీఐ తెలిపింది. ఇందులో ఉత్తరప్రదేశ్‌కు అత్యధికంగా రూ.4,000 కోట్లు, అత్యల్పంగా అరుణాచల్‌ప్రదేశ్‌కు రూ.170 కోట్ల రుణం మంజూరు చేసింది.

ఆర్థిక స్థితిపై పవర్‌పాయింట్

- అసెంబ్లీలో పీపీటీకి రాష్ట్ర సర్కారు ఏర్పాట్లు
- శ్వేతపత్రం విడుదల చేయనున్న ప్రభుత్వం
- నివేదిక సిద్ధం చేసిన అధికారులు
- ప్రభుత్వం.. ప్రతిపక్షం.. టగ్ ఆఫ్ వార్
- కౌంటర్‌కు సిద్ధమైన ప్రతిపక్ష బీఆర్ఎస్

హైదరాబాద్, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర అసెంబ్లీ బుధవారం ఆసక్తికర చర్చకు వేదిక కానున్నది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ప్రజలకు వివరించేందుకు అటు ప్రభుత్వం, ఇటు ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ సిద్ధమయ్యాయి. కేసీఆర్ పాలనలో రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయిందని ప్రజలకు చెప్పాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తున్నది. ఈ మేరకు బుధవారం అసెంబ్లీలో శ్వేతపత్రం విడుదల చేయనున్నది. 'తెలంగాణ రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు– శ్వేతపత్రం' అంశంపై లఘు చర్చ ఉంటుందని అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులు ఉత్తర్వులు జారీ చేశారు. దీనికి కౌంటర్‌గా తొమ్మిదిన్నరేండ్లలో జరిగిన అభివృద్ధిని, ఆర్థిక రంగంలో సాధించిన విజయాలను ప్రజలకు వివరించాలని బీఆర్ఎస్ సిద్ధమైంది. అటు ప్రభుత్వం, ఇటు ప్రతిపక్షం తమ వాదనను బలంగా వినిపించేందుకు 'పవర్ పాయింట్ ప్రజెంటేషన్'ను (పీపీటీ) మార్గంగా ఎంచుకున్నట్టు సమాచారం. ఇప్పటికే పీపీటీ ప్రదర్శనకు అసెంబ్లీలో ప్రత్యేకంగా టీవీలు, ప్రొజెక్టర్ ఏర్పాటు చేశారని సమాచారం.

ఆర్థిక స్థితిపై పోస్ట్‌మార్టం!

తొమ్మిదిన్నరేండ్ల కేసీఆర్ పాలనలో రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందని సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు ఎన్నికల ప్రచారం నుంచీ ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే. తర్వాత కూడా పలుమార్లు ఇదే విషయాన్ని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేస్తామని ఈ నెల 8న మంత్రి శ్రీధర్‌బాబు ప్రకటించారు. శ్వేతపత్రం తయారీకి సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిసింది. ఇందులో దాదాపు 20 మంది ఉన్నట్టు సమాచారం. ఆర్థికశాఖ ఉన్నతాధికారులు, వివిధ విభాగాల అధికారులు, ఆర్థిక రంగ నిపుణులు, పలువురు ప్రస్తుత, రిటైర్డ్ ప్రొఫెసర్లు సభ్యులుగా ఉన్నట్టు తెలిసింది. వీరంతా కొన్ని రోజులుగా తొమ్మిదిన్నరేండ్లలో జరిగిన ఆర్థిక లావాదేవీలు, ఆదాయ వ్యయాలు, నిధుల సమీకరణ, కేటాయింపు తదితర అంశాలపై లోతుగా విశ్లేషిస్తున్నారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న అప్పులు, కార్పొరేషన్లకు ఇచ్చిన గ్యారెంటీల లెక్కలను ప్రత్యేకంగా తెప్పించుకున్నారు. దీంతోపాటు శాఖల వారీగా సమగ్ర వివరాల నివేదికలు వారి వద్దకు చేరాయి. ఏ ఏడాది.. ఏ పథకం కింద.. ఎంత మేరకు నిధులు మంజూరయ్యాయి? ఎంత వినియోగించారు? ఏవైనా నిధులను మళ్లించారా? వంటి వివరాలపై ఆరా తీశారు. గత ప్రభుత్వాన్ని ఏ విధంగా ఇరుకున పెట్టొచ్చనే కోణంలో తీవ్ర చర్చలు జరిపిన అనంతరం.. ప్రత్యేక నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి అందజేసినట్టు తెలిసింది. ఈ శ్వేతపత్రాన్ని ప్రభుత్వం బుధవారం అసెంబ్లీలో విడుదల చేయనున్నది.

ప్రాజెక్టులపై నాడే కేసీఆర్ పీపీటీ

తెలంగాణ ఏర్పడిన కొత్తలోనే అసెంబ్లీలో అద్భుతమైన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ప్రసారమైంది. సీఎంగా తొలిసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత తెలంగాణలోని నీటి వనరులు, ఇప్పటికే ఉన్న సాగునీటి ప్రాజెక్టులు, కొత్తగా నిర్మించాల్సిన అవసరం ఉన్న ప్రాజెక్టులపై కేసీఆర్ పీపీటీ ద్వారా వివరించారు. ముఖ్యంగా కాళేశ్వరం ప్రాజెక్టు ఆవశ్యకతపై సామాన్యులకు కూడా అర్థమయ్యే రీతిలో పూసగుచ్చినట్టు తెలిపారు. ఒక రాజకీయ నాయకుడికి భౌగోళిక, ఆర్థిక, ఇంజినీరింగ్ అంశాలపై ఇంతటి అపార అవగాహన ఉండటం అద్భుతమని నాడు నిపుణులు కేసీఆర్‌ను కొనియాడారు.

శ్వేతపత్రాన్ని ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టి, వివరాలను తెలియజేస్తారా? లేదా సీఎం రేవంత్‌రెడ్డి సభ ముందు ఉంచుతారా? అనే చర్చ జరుగుతున్నది.

కౌంటర్ ఇచ్చేందుకు బీఆర్ఎస్ రెడీ

ప్రభుత్వ శ్వేతపత్రానికి ధీటుగా కౌంటర్ ఇవ్వాలని బీఆర్ఎస్ సిద్ధమైంది. పార్టీ తరఫున మాజీ ఆర్థిక మంత్రి హరీశ్‌రావు సమాధానం ఇవ్వనున్నారు. కేసీఆర్ పాలనలో రాష్ట్ర ఆర్థిక రంగం సాధించిన ప్రగతిని వివరించనున్నారు. 2014తో పోల్చితే 2023 నాటికి తెలంగాణ ఆర్థిక శక్తిగా ఎలా ఎదిగిందో గణాంకాలతో సహా వివరించాలని భావిస్తున్నారు. ఈ మేరకు ఇప్పటికే ప్రత్యేక బృందంతో సమగ్ర నివేదిక తయారు చేయించినట్టు సమాచారం. జీఎస్డీపీ, తలసరి ఆదాయం, సొంత పన్నుల రాబడి ఎలా పెరిగాయో తెలియజేయనున్నారు. ప్రభుత్వం సేకరించిన నిధులను మూలధన పెట్టుబడిగా ఏయే రంగాల్లో ఖర్చు చేసిందో, వాటి వల్ల ఆయా రంగాల్లో జరిగిన ప్రగతి ఏమిటో వివరించనున్నారు. ఏయే పథకాల వల్ల ప్రజలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎలాంటి ప్రయోజనం కలిగిందో చెప్పనున్నారు. ఆ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాల వల్ల ఆర్థికంగా, సామాజికంగా సమాజంలో వచ్చిన మార్పును వివరించాలని నిర్ణయించారు. శాఖలవారీగా ఆయా రంగాల్లో వచ్చిన మార్పును మరోసారి ప్రజల కండ్లకు కట్టే ప్రయత్నం చేయనున్నారు. ఒకప్పుడు వ్యవసాయ రంగం పరిస్థితి ఎలా ఉండేది? ఇప్పుడు దేశానికే అన్నం పెట్టే స్థాయికి తెలంగాణ ఏ విధంగా చేరింది? ఇందుకు వ్యవసాయ, సాగునీటి రంగాలపై ప్రభుత్వం చేసిన వ్యయం వంటివి సమగ్రంగా వివరించనున్నారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందన్న కాంగ్రెస్ వాదనలను తిప్పికొట్టనున్నారు. ఈ మేరకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను కూడా సిద్ధం చేశారు.

శ్వేతపత్రంపై లఘు చర్చ

అసెంబ్లీ మొదటి సమావేశాల ఐదోరోజు సందర్భంగా సంతాప ప్రతిపాదనలు, లఘు చర్చ నిర్వహించనున్నారు. మెదక్ జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే రామన్నగారి శ్రీనివాస్‌రెడ్డి, వికారాబాద్ జిల్లా పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల హరీశ్వర్‌రెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం మాజీ ఎమ్మెల్యే కుంజా సత్యవతి మరణం పట్ల సభ సంతాపం తెలియజేయనున్నది. అనంతరం 'తెలంగాణ రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు–శ్వేతపత్రం'పై లఘు చర్చ జరుగనున్నది. అధికార, ప్రతిపక్షాలకు ఇద్దరికీ అవకాశం లభిస్తే.. అసెంబ్లీలో ఇలా ఒక అంశంపై అధికార ప్రతిపక్షాలు పవర్ పాయింట్ ప్రజెంటేషన్లు ఇవ్వటం ఇదే మొదటిసారి అవుతుంది.

మాకూ అవకాశం ఇవ్వండి: హరీశ్‌రావు

శాసనసభలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ కోసం ప్రధాన ప్రతిక్షమైన బీఆర్ఎస్‌కూ అవకాశం ఇవ్వాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు శాసన సభ స్పీకర్‌ను కోరారు. ఈ మేరకు మంగళవారం స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు హరీశ్‌రావు వినతి పత్రం సమర్పించారు. 'బుధవారం నుంచి జరిగే శాసనసభ సమావేశాల్లో ఆర్థిక, సాగునీటి, విద్యుత్తు అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నట్టు సమాచారం ఉన్నది. ఒకవేళ ప్రభుత్వానికి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌కు అనుమతి ఇచ్చినట్టయితే, దానికి సంబంధించి ప్రధాన ప్రతిపక్షంగా ప్రజలకు సభ ద్వారా మా వివరణ (మా వెర్షన్) కూడా చెప్పాల్సి ఉంటుంది. మేము కూడా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం. కావున దయచేసి మా బీఆర్ఎస్ శాసనసభా పక్షానికి కూడా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చేందుకు అనుమతి ఇవ్వగలరని మనవి' అని హరీశ్‌రావు వినతిపత్రంలో పేర్కొన్నారు.

హామీలు ఎగ్గొట్టేందుకే శ్వేతపత్ర డ్రామాలు: కేటీఆర్

ఎన్నికల హామీలు ఎగ్గొట్టేందుకే కాంగ్రెస్ నాయకులు శ్వేత పత్రాల డ్రామాలు ఆడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఇచ్చిన ఆరు గ్యారెంటీలను గాలికొదిలేసి శ్వేతపత్రాలతో గారడీ చేస్తామంటే కుదరదని మంగళవారం ఆయన ట్విట్టర్‌వేదికగా కాంగ్రెస్‌పై ప్రశ్నల వర్షం కురిపించారు. ప్రచారంలో హామీలను ఊదరగొట్టి అధికారంలోకి రాగానే మభ్యపెడతారా? కుంటిసాకులతో పథకాలకు పాతరేస్తారా? అని కేటీఆర్ ప్రశ్నించారు. తొమ్మిదిన్నరేండ్ల బీఆర్ఎస్ ప్రగతి ప్రస్థానం.. తెలంగాణ ప్రజల ముందు తెరిచిన పుస్తకమని కేటీఆర్ చెప్పారు. శాసనసభకు సమర్పించిన బడ్జెట్ పత్రాలన్ని ఆస్తులు.. అప్పులు.. ఆదాయ వ్యయాల శ్వేత పత్రాలే కదా అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో తాము విడుదల చేసిన ప్రతి ప్రగతి నివేదిక.. ఓ స్వచ్ఛమైన శ్వేతపత్రమని, ఆడిట్ రిపోర్ట్‌లు, ఆర్బీఐ నివేదికలు ప్రతిపైసాకు లెక్కా పత్రం చూపించి ఆర్థిక స్థితిని ఆవిష్కరించాయని చెప్పారు. కాంగ్రెస్ శోధించి సాధించేది ఏమీ ఉండబోదని స్పష్టం చేశారు.

లోకం పోకడ

పార్లమెంటులోకి అగంతకుల్ని రాకుండా చేయడం వాళ్ల వల్ల కాదట.. కావాలంటే విపక్ష ఎంపీలను రాకుండా చేయగలరట!

21న కలెక్టర్ల సదస్సు

హైదరాబాద్, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 21న అన్ని జిల్లాల కలెక్టర్లతో సమావేశం కానున్నారు. సచివాలయంలోని ఏడో అంతస్తులో నిర్వహించే ఈ సదస్సుకు అన్ని జిల్లాల కలెక్టర్లు హాజరు కావాలని రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. మధ్యాహ్నం 3 గంటలకు తేనీటి విందు ఉంటుందని, తర్వాత 4 గంటల నుంచి సమావేశం ప్రారంభం అవుతుందని అందులో పేర్కొన్నారు. సంబంధిత అంశాలపై సమగ్ర సమాచారంతో రావాలని సూచించారు. ప్రధానంగా ధరణి, భూ సంబంధ సమస్యలు, ఆరు గ్యారంటీల అమలు, వనరుల సేకరణ వంటి అంశాలపై చర్చించే అవకాశం ఉన్నదని సమాచారం.

చలి వణుకు

	కనిష్ఠం	గరిష్ఠం
రంగారెడ్డి	13.6°c	31.5°c
మెదక్	13.7°c	31.3°c
ఆదిలాబాద్	14.0°c	30.0°c
వరంగల్	15.0°c	28.0°c
కరీంనగర్	16.0°c	27.0°c
ఖమ్మం	16.0°c	28.0°c
నిజామాబాద్	16.1°c	27.7 °c
నల్లగొండ	16.4°c	32.3°c
హైదరాబాద్	17.9°c	27.7°c
మహబూబ్‌నగర్	19.1°c	29.8°c

సర్కారు భూమి కబ్జాకు కాంగ్రెస్ నేత యత్నం

- అడ్డుకున్న మండల రెవెన్యూ అధికారులు
- భూపాలపల్లిలో ఘటన.. ట్రాక్టర్ స్వాధీనం

జయశంకర్ భూపాలపల్లి, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ): జయశంకర్ భూపాలపల్లి జిల్లాకేంద్రంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొనేందుకు ఓ కాంగ్రెస్ నేత విఫలయత్నం చేశాడు. ప్రభుత్వ భూమిని చదును చేసుకుని ఆక్రమించుకునే ప్రయత్నం చేయగా రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. భూపాలపల్లిలోని ప్రధాన రహదారికి సమీపంలో 170 సర్వే నంబర్‌లోని విలువైన ఎకరం ప్రభుత్వ భూమిలో పాగా వేసేందుకు పెద్దకుంటపల్లికి చెందిన కాంగ్రెస్ నేత నంగావత్ నాను దాన్ని మంగళవారం ట్రాక్టర్‌తో చదును చేయించాడు. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు అక్కడికి చేరుకుని పనులను అడ్డుకున్నారు. ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై తాసిల్దార్ వై శ్రీనివాసులను వివరణ కోరగా.. ప్రభుత్వ భూమిని నంగావత్ నాను అక్రమంగా చదును చేయిస్తున్నారని తెలిపారు. ఈ స్థలాన్ని ఇప్పటికే ట్రెస్పాకు కేటాయించామని, అతని వద్ద ఆధారాలు ఉంటే తీసుకురావాలని కోరినా తీసుకురాలేదని వెల్లడించారు.

విత్తన కంపెనీల లైసెన్స్‌లను పున: పరిశీలించండి

- నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న కంపెనీల లైసెన్స్‌లను రద్దు చేయండి
- నకిలీ విత్తనాల మాట వినిపించొద్దు
- అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం

హైదరాబాద్, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ): విత్తన కంపెనీల లైసెన్స్‌లను సమగ్రంగా పరిశీలించి నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న కంపెనీల లైసెన్స్‌లను రద్దు చేయాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతులకు ఆయా కంపెనీల నుంచి నష్టపరిహారం ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో నకిలీ విత్తనాల మాట వినిపించొద్దని, ఎక్కడిక్కడ తనిఖీలు నిర్వహించి సరఫరా చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టంచేశారు. యాసంగి సీజన్‌తోపాటు రాబోయే వానకాలం సీజన్‌కు అవసరమైన నాణ్యమైన విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచాలని కోరారు. మంగళవారం సచివాలయంలో విత్తనరంగ అభివృద్ధిపై తుమ్మల సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని కంపెనీలు ఇక్కడి రైతుల అవసరాలు తీర్చిన తర్వాతే ఎగుమతి చేసుకోవాలని చెప్పారు. విత్తనాలకు మార్కెట్ సెస్ నుంచి మినహాయింపు ఇవ్వాలని సమావేశానికి హాజరైన విత్తన కంపెనీల ప్రతినిధులు మంత్రికి విజ్ఞప్తిచేశారు. సమావేశంలో వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, డైరెక్టర్ గోపి, విత్తనాభివృద్ధి సంస్థ ఎండీ కేశవులు, నూజివీడు సీడ్స్ ఎండీ ప్రభాకర్‌రావు, కావేరీ సీడ్స్ ఎండీ భాస్కర్‌రావు, రాశి సీడ్స్ సీవోవో ఏఎస్ఎన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దళితుల శ్మశానం కబ్జా

మొదటిపేజీ తరువాయి...

రాజాపూర్ మండలం ఇప్పటూరు గ్రామ శివారులోని వాగు వెంట ఉన్న సుమారు ఎకరం భూమిని దళితులు కొన్నేండ్లుగా శ్మశానవాటికగా వినియోగిస్తున్నారు. ఇప్పటికే సుమారు 40 నుంచి 50 మృతదేహాలను అక్కడ పూడ్చిపెట్టారు. ఆ భూమి రెవెన్యూ రికార్డుల్లో సైతం దళితుల శ్మశాన వాటికగానే నమోదై ఉన్నది. కాగా వారం క్రితం రాజాపూర్ మండలం దోండ్లపల్లికి చెందిన కాంగ్రెస్ నేత కత్తెర కృష్ణయ్య తన అనుచరులతో ఒక జేసీబీని తీసుకొచ్చి శ్మశాన వాటికను ధ్వంసం చేశాడని, ఆ భూమిని చదును చేశాడని దళితులు ఆరోపిస్తున్నారు. ఈ శ్మశానవాటికకు ఆనుకుని ఉన్న 16 ఎకరాల గైరాన్ భూమిని కత్తెర కృష్ణయ్య గతంలోనే పట్టా పొందినట్టు సమాచారం. కృష్ణయ్యపై చర్య తీసుకోవాలంటూ కోడగంటి మహేశ్వర్ తదితరులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. తహసిల్దార్ సూచన మేరకు రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారులు ఈ భూమిని సర్వే చేసేందుకు వచ్చారని, అయితే, ఒక ప్రజాప్రతినిధి ఫోన్ చేయడంతో వారు వెనుదిరిగి పోయారని దళితులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. 'ఇది రెండు మండలాల సరిహద్దు ప్రాంతం. మళ్లీ వస్తాం' అంటూ అధికారులు వెళ్లిపోయారని దళితులు చెప్తున్నారు. చివరకు ఈ శ్మశానవాటిక రాజాపూర్ మండలం పరిధిలోకి వస్తుందని తహసిల్దార్ నివేదిక ఇచ్చారు. మరోవైపు అకారణంగా తన పొలంపైకి వచ్చారంటూ పలువురు దళితులపై కాంగ్రెస్ నేత కృష్ణయ్య రాజాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో శ్మశానవాటిక పరిరక్షణ కోసం పోరాడుతున్న కోడగంటి మహేశ్వర్, ఇస్తారయ్య, చంద్రయ్య, బుర్ర బుడ్డయ్య, లక్ష్మయ్య, యాదయ్యపై రాజాపూర్ పోలీసులు ఎఫ్ ఐఆర్ జారీ చేశారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి ప్రోద్బలంతోనే పోలీసులు తమపై కేసులు నమోదు చేశారని దళితులు ఆరోపిస్తున్నారు. మంగళవారం రాజాపూర్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి శ్మశాన వాటికను ధ్వంసం చేసిన వారిపై చర్య తీసుకోవాలంటూ లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. మరోవైపు దళితుల ఫిర్యాదు మేరకు సర్వే చేసి నివేదిక ఇవ్వాలని సర్వే అసిస్టెంట్ డైరెక్టర్‌ను కలెక్టర్ ఆదేశించారు.

నవాబ్‌పేట మండలం ఇప్పటూరులో చదునుచేసిన దళితుల శ్మశాన వాటికగా పేర్కొంటున్న భూమి

ఇసుక దందా కోసమే..

రాజాపూర్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, ఆయన అనుచరులు దళితుల శ్మశానవాటికను ధ్వంసం చేశారు. మా పూర్వీకుల సమాధులన్నింటినీ నాశనం చేశారు. జేసీబీతో చదును చేస్తుంటే పుర్రెలు, ఎముకలు బయటపడ్డాయి. వాటిని నామరూపాలు లేకుండా చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇదంతా ఇసుక దందా కోసం చేస్తున్నారు. శ్మశానవాటిక జోలికి రాబోమని గతంలో రెండు గ్రామాలు ఒప్పందం చేసుకున్నాయి. అయితే, ప్రభుత్వం మారగానే కాంగ్రెస్ నాయకులు దౌర్జన్యంగా శ్మశానవాటికను ధ్వంసం చేయడమే కాకుండా మాపై తప్పుడు కేసులు పెట్టారు. వీటికి భయపడేది లేదు. శ్మశానవాటిక స్థలాన్ని కేటాయించి హద్దులు పాతకపోతే ఆందోళన చేస్తాం.

- కోడుగంటి మహేశ్వర్, ఇప్పటూరు, నవాబ్‌పేట మండలం, మహబూబ్‌నగర్ జిల్లా

విచారణ చేస్తున్నాం

ఇప్పటూర్ దళితుల స్మశానవాటికను రాజాపూర్ మండలం దోండ్లపల్లికి చెందిన కత్తెర కృష్ణయ్య ఆక్రమించారని దళితులు ఆందోళన చేశారు. రెండు మండలాల పోలీసులు, రెవెన్యూ అధికారుల సమక్షంలో సర్వే చేయించాం. ఆ భూమిలో కృష్ణయ్య రాతి కడిలు పెట్టాడు. వాటిని ఇప్పటూర్ దళితులు ధ్వంసం చేశారంటూ కృష్ణయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. కృష్ణయ్య శ్మశానవాటికను ఆక్రమించారంటూ ఇప్పటూర్ దళితులు కూడా ఫిర్యాదు చేశారు. ఈ వివాదంపై విచారణ జరిపిస్తున్నాం.

- వెంకట్‌రెడ్డి, ఎస్సై, రాజాపూర్ మండలం

అది ప్రభుత్వ భూమి

దళితుల ఫిర్యాదు మేరకు రెండు మండలాలకు చెందిన పోలీసులు, రెవెన్యూ అధికారుల సమక్షంలో శ్మశాన వాటికను సర్వే చేయించాం. ఈ భూమిలో కత్తెర కృష్ణయ్యకు 17.26 ఎకరాల పొలం ఉండగా, అదనంగా వాగులో ఉన్న 12 గుంటలు కూడా సాగు చేశారు. ఇందులో దళితులకు సంబంధించిన ఎలాంటి గోరీలు లేవు. ఈ వాగు పొలంతో దళితులకు గానీ, కృష్ణయ్యకుగానీ సంబంధం లేదు. ఇది ప్రభుత్వ భూమి.

- ఖదీర్, ఆర్ఐ, రాజాపూర్ మండలం

కాంగ్రెస్‌లో పదవుల సంక్రాంతి!

- మంత్రి పదవులు, నామినేటెడ్ పోస్టులు, ఎమ్మెల్సీ పదవుల భర్తీపై అభిష్టానం దృష్టి
- పదవులు తక్కువ.. పోటీ ఎక్కువ
- ఇటు రాష్ట్రంలో, అటు ఢిల్లీలో పైరవీల జోరు
- ఎమ్మెల్సీ పోటీలో సీనియర్ నేతలు

హైదరాబాద్, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీలో నామినేటెడ్ పదవుల భర్తీ కోలాహలం మొదలైంది. రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో నామినేటెడ్ పదవుల భర్తీపై అధిష్టానం దృష్టి పెట్టింది. పదేండ్లుగా అధికారానికి దూరంగా ఉన్నప్పటికీ, పార్టీ కోసం పనిచేసిన నేతలకు సంక్రాంతి కానుకగా నామినెటెడ్ పోస్టులు ఇవ్వాలని భావిస్తున్నది. గాంధీభవన్‌లో జరిగిన పార్టీ పీఏసీ మీటింగ్‌లో నెలలోగా పదవులు భర్తీ చేస్తామని సీఎం రేవంత్ కూడా చెప్పడంతో ఆశావహులు తమ ప్రయత్నాలు మొదలుపెట్టారు. ప్రస్తుతం రాష్ట్రంలో 54 కార్పొరేషన్ల చైర్మన్లు, ఆరు ఎమ్మెల్సీలు, మరో ఆరు మంత్రి పదవులు భర్తీ చేయాల్సి ఉన్నది. ఎమ్మెల్సీ పదవుల కోసం సీనియర్ నేతలు షబ్బీర్ అలీ, మధుయాష్కీగౌడ్, జగ్గారెడ్డి వంటి వారు ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిసింది. ఎమ్మెల్యే టికెట్ దక్కని అద్దంకి దయాకర్ వంటి నేతలకు అధిష్టానం ఎమ్మెల్సీ హామీ ఇచ్చింది. దీంతో ఆరు ఎమ్మెల్సీ స్థానాలకు పోటీ తీవ్రంగా నెలకొన్నది. ఈ నేపథ్యంలో జిల్లా స్థాయి నేతలు కార్పొరేషన్ చైర్మన్ పదవులపై దృష్టి పెట్టారు. ప్రస్తుతం రాష్ట్రంలో 54 కార్పొరేషన్ల చైర్మన్ పదవులు ఖాళీగా ఉన్నాయి. వీటి కోసం పోటీ పడుతున్నవారి సంఖ్య అంతకంటే ఎక్కువగా ఉన్నది. ఆయా పదవులపై గురిపెట్టిన పలువురు నేతలు ఇటు రాష్ట్ర నాయకత్వం, అటు ఢిల్లీ అధిష్టానం వద్ద పైరవీలు షురూ చేశారు. ముఖ్యంగా సీఎం రేవంత్‌రెడ్డిని కలిసేందుకు నానా తంటాలు పడుతున్నారు. సోమవారం గాంధీభవన్‌కు వచ్చిన ఆయనను కలిసేందుకు భారీగా నేతలు తరలిరావడం గమనార్హం. రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పనులు, సమీక్షల్లో బిజీగా ఉండటంతో ఆయనను కలవడం కష్టంగా మారిందని పార్టీ నేతలు చెప్తున్నారు.

వారిక